చంద్రన్నా.. బీమా అమలు ఏదన్నా!

- ఏడాది గడిచినా దరఖాస్తులను స్వీకరించని ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమాతో పేద కుటుంబాలకు ఆసరా
- కూటమి ప్రభుత్వంలో ఇప్పటికీ తెరచుకోని వెబ్ సైట్



పెదకాకాని: ఎన్నికలకు ముందు ప్రజలకు అమలు కాని ఎన్నో హామీలు ఇచి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతోంది. పథకాల పేర్ల మార్పుతోనే కూటమి ప్రభుత్వం సరిపెట్టుకుంటుంది. కుటుంబాల్లో చనిపోయిన వారికి ఇస్తామన్న చంద్రన్న బీమా పథకం అమలు చేయడంలోనూ నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

పేరు మార్పుతో సరి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రన్న బీమాగా పేరు మార్చి సరిపెట్టుకున్నారు. ఇప్పటి వరకు పథకం విధి విధానాలు ప్రకటించలేదు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు అందిస్తామని ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది పూర్తి చేసుకుని తొలి అడుగు పేరుతో సంబరాలు చేస్తున్నారే కానీ బీమా పథకం అమలును పట్టించుకోకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో అమలు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో 18 నుంచి 50 ఏళ్లలోపు, 50 నుంచి 60 ఏళ్ల వారు మృతి చెందితే రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వైఎస్సార్ బీమా మంజూరయ్యేది. మృతి చెందిన వెంటనే వాలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.10 వేలు ఇచ్చేవారు. మిగతా సొమ్ము 15 రోజుల్లో నామినీ పేరుతో బ్యాంక్ ఖాతాలో జమయ్యేది. ఈ బీమా సొమ్ము కోసం ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించేది. తద్వారా పేద కుటుంబాలకు సత్వర సాయం అందేది. ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకాన్ని గాలికి వదిలేసింది.

ప్రారంభం కాని వెబ్ సైట్..

2024 మే తర్వాత కూటమి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం వెబ్‌సైట్‌ను తొలగించింది. ఆ తర్వాత చంద్రన్న బీమాగా మార్చినా వెబ్‌సైట్‌ను ఇప్పటి వరకూ ప్రారంభించలేదు. మృతి చెందిన కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు మార్గదర్శకాలు కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు లేవని.. సైట్ ఓపెన్ కావడంలేదని.. ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.

చంద్రన్న బీమా అమలు చేయాలి..



కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమాను అమలు చేసి మృతుల కుటుంబాలకు అండగా నిలవాలి. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలను బాధిత కుటుంబాలకు చెల్లిస్తామని ఎన్నికలకు ముందు కూటమి నాయకులు మాట ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

– షేక్ నజీర్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు

మృతుల కుటుంబాలకు మొండిచెయ్యి..



ఆపదలో ఉన్న మృతుల కుటుంబాలకు అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా మృతుల కుటుంబాలకు మొండి చెయ్యి చూపిస్తోంది. ఏడాది కాలంలో కనీసం చంద్రన్న బీమా వెబ్‌సైట్ కూడా ఓపెన్ కావడం లేదు. కుటుంబ యజమానులను కోల్పోయిన పలువురు బాధితులు బీమా కోసం ఎదురు చూస్తున్నారు.

– ముదియాల మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు

క్లుప్తంగా

ఉదిత్ ప్రధాన్‌ను వెంటనే శిక్షించాలి



పెదకాకాని(ఏఎన్‌యూ): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఒరిస్సా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్‌ప్రదాన్ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ ఏబీవీపీ ఉపాధ్యక్షుడు హేమంత్‌రామ్ మాట్లాడుతూ.. ఒరిస్సాలో 19 ఏళ్ల యువతిపై అత్యాచారం చేసిన ఎన్ఎస్‌యూఐ ఒరిస్సా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్‌ను వెంటనే శిక్షించాలని కోరారు. ఎన్ఎస్‌యూని దేశమంతటా బ్యాన్ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ పేరుతో విద్యార్థులపై దాడులు చేయాలని నేరిస్తుందా అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి సాగులో జాగ్రత్తలు పాటించాలి



పొన్నూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వరి సాగులో తగిన జాగ్రత్తలు పాటించాలని ఏవో ఆర్.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని ములుకుదురు, మాచవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ.. వరి వెద సాగు చేసిన పైరులో నీరు నిల్వ చేరకుండా ఉంచాలని సూచించారు. లేనిపక్షంలో విత్తనం మొలక శాతం దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని.. నీరు ఇంకిన తరువాత యూరియా, 19,19,19 పిచికారీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో బదిలీలు సాధారణం



కాకుమాను: ప్రభుత్వ ఉద్యోగంలో బదిలీలు సర్వ సాధారణమని ఎంఈవో కె.ఎఫ్.కెన్నడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి బదిలీ అయిన సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి గా పాల్గొన్న కెన్నడీ మాట్లాడుతూ.. ఉపాధ్యా య వృత్తిలో బదిలీలు సాధారణమని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పని చేసిన బి.సత్యం బదిలీపై వెళ్లగా ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ప్రజలకు అండగా సీపీఐ జెండా



గుంటూరు రూరల్: కార్మిక, కర్షక, ప్రజలకు అండగా సీపీఐ జెండా నిరంతర పోరాటాలతో అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గ భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభ, ప్రత్తిపాడు కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో నియోజవర్గ సీపీఐ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరావు అధ్యక్షతన ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన అజయ్‌కుమార్ మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా సీపీఐ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నియోజవర్గ కార్యదర్శిగా రామిశెట్టి అదేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా సోమపల్లి అంజిబాబు, తన్నీరు ప్రభుదాసు, మండల కార్యదర్శిగా మామిడి అంకమ్మరావు, కోశాధికారిగా గుంటుపల్లి రవిబాబు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జెండాను అజయ్ ఆవిష్కరించారు. అనంతరం జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోడిరెక్క కోటిరత్నం, మహిళా అధ్యక్షురాలు పెనుబాక రమాదేవి, గోపిరెడ్డి నాగిరెడ్డి, మేడ తాతారావు, గొట్టం ప్రవీణ్, కాకర్ల జగదీష్, పి.సాయిసిద్ధిరవి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజలకు తెలియజేయాలి



తక్కెళ్లపాడులో బాబు మోసాలపై మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ.

- ఏడాది గడిచినా ఒక్క హామీ నెరవేర్చలేదు
- వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, దేవరాయబొట్లవారిపాలెం, తంగెళ్లమూడి గ్రామాల్లో బుధవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు ముదియాల మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అంబటి మురళీకృష్ణ స్థానిక ప్రజలతో కలిసి నేలపై కూర్చుని కూటమి మోసాలను ప్రజలకు వివరించారు. సూపర్‌సిక్స్ పథకాల పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. సాక్షాత్తూ రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేశాం.. ఆడబిడ్డ నిధి నెలకు రూ.1500 ఇవ్వాలంటే ఆంధ్రాని అమ్మాలనే ఆలోచన చేస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం బాబు మోసపూరిత ఎన్నికల మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, శివాబత్తుని దయానంద్, పెనుమాల అరుణ్, తమనం భూషణం, పెనుమాల సునందమ్మ, కూచిపూడి నాగరాజు, గైడు, మధు, సురేష్, పెరుమాళ్ల అనిల్‌కుమార్, మేడిద పద్మాకర్, సుంకర కృష్ణారెడ్డి, ఆలపాటి రాఘవ, ఫ్రాన్సిస్, గళ్లా మల్లికార్జునరావు, తోటకూర వెంకటేశ్వరావు, అమ్మిశెట్టి శివశంకరరావు, కానుగోలు గోపి, బద్దెపూడి రమేష్, రవీంద్ర, భోజంకుల ఏసోబు, దిలీప్, పలువురు అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ, పార్టీ నాయకులు

ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలి

గుంటూరు రూరల్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు తగిన డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేసుకుని.. నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని, లేకుంటే మార్టిగేజ్ మంజూరు చేయమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం ఆయన గోరంట్ల, గాయత్రీ నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, డ్రైనేజీ కనెక్షన్ లేని వాటికి మార్టిగేజ్ మంజూరు నిలిపివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాల నిర్మాణాలు జరగాలని అన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. అనంతరం చౌడవరంలోని సీఆర్ కాలనీలో పర్యటించి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, ఎస్ఎస్ ఐజాక్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

• బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు!



పెదకాకాని మండలంలో వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ స్థానికులపై ఎగబడుతున్నాయి. దీంతో ప్రజలు భయంతో పరుగులు తీస్తున్నారు. గత కొంతకాలంగా పెదకాకాని పంచాయతీలో వీధి కుక్కలను పట్టించే కార్యక్రమం నిలిచి పోయింది. పెదకాకాని గుంటూరు నగరానికి సమీపంలో ఉండడం.. పెదకాకాని చుట్టుపక్కల పంట భూములు రియల్‌ఎస్టేట్‌గా మారడంతో గుంటూరు చుట్టుపక్కల గ్రామాల్లో పట్టుకున్న వీధి కుక్కలను సైతం ఈ ప్రాంతానికి తీసుకువచ్చి వదిలేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు కోరుతున్నారు.

– పెదకాకాని

మండల స్థాయి సమీక్షా సమావేశం

దుగ్గిరాల: పలు అభివృద్ధి పనులుపై దుగ్గిరాల మండలంలోని గ్రామ కార్యదర్శిలకు మండల స్థాయి సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. దుగ్గిరాల మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో పీ–4 బంగారు కుటుంబాలు, హౌసింగ్ పనులపై సమీక్షను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా పంచాయతీ అధికారి కె.సాయి కుమార్.. గ్రామ, మండల అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి

తాడేపల్లి రూరల్: విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలని తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి సూచించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ విమల్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ఇతర వ్యాపకాలపై దృష్టి మళ్లితే భవిష్యత్తు అంధకారం అవుతుందని అన్నారు.

డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకోవాలి

తాడేపల్లి రూరల్: డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకుని వ్యవసాయ రంగంలో మార్పులకు శ్రీకారం చుట్టాలని టీడీపీ మండల అధ్యక్షులు దాసరి కృష్ణ అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో రైతుమిత్ర గ్రూప్ సభ్యులు ధనేకుల వేణు, ధనేకుల రామ్ ప్రసాద్‌లకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్‌ను అందజేశారు. కార్యక్రమంలో చిర్రావూరు గ్రామ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ వీరిశెట్టి శ్రీనివాసరావు, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు అంకం కాశీకృష్ణ, ఏఈవోలు రమేష్ బాబు, పావని, డ్రోగో సంస్థ ప్రతినిధులు పృధ్విరాజ్, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంపై కేసు

ఫిరంగిపురం: మండల పరిధి బేతపూడి గ్రామంలోని హరికార్తికేయ మద్యం దుకాణంలో అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్నారంటూ బుధవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ జి.యశోద తెలిపారు. సిబ్బందితో తనిఖీలు చేసి బాటిల్‌పై 10 రూపాయలు అధికంగా అమ్ముతున్నారంటూ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి

దుగ్గిరాల: రైతులందరూ తప్పని సరిగా పంట బీమా నమోదు చేయించుకోవాలని.. దానిద్వారా పంట నష్టపరిహారం లభిస్తుందని ఏవో ఆర్.విజయబాబు అన్నారు. బుధవారం చింతలపూడి గ్రామంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. బీమా నమోదు చేయించుకుంటే పంట నష్టాల నుంచి రైతులు తేరుకోవచ్చునని ఆయన తెలిపారు.

రోడ్లకు మార్జిన్ లేక అవస్థలు



రోడ్డు పక్కకు ఒరిగిన పాఠశాల బస్సు

దుగ్గిరాల: దుగ్గిరాలలోని ఈమని గ్రామంలో తారు రోడ్డు వేశారు కానీ.. పక్కన మార్జిన్ మాత్రం నామమాత్రంగా చేసి వదిలేశారు. గత మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తారు రోడ్డు మార్జిన్ గట్టిగా లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం సాయంత్రం ఓ పాఠశాల బస్సు మార్జిన్ సరిగా లేకపోవడంతో రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు వదులుతున్న అధికారులు ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా నాణ్యతా ప్రమాణాలను పెంచాలని పలువురు కోరుతున్నారు.

అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు

- చంద్రబాబును నమ్మితే నట్టేటా మునిగినట్టే
- బాబు మోసాలను ప్రజలకు ప్రతి కార్యకర్త చేరవేయాలి
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు



వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

గుంటూరు రూరల్: అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని జేకేసీ కళాశాల రోడ్డులో గల వికాస్‌ఇన్ హోటల్‌లో రూరల్ మండలం అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్, ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఎలాగైరనా గద్దెను ఎక్కాలని 600 హామీలను ఇచ్చి ప్రజలను నేడు నట్టేటా ముంచాడన్నారు. చంద్రబాబు తమ సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేసుకునేందుకు పేద ప్రజలను అణగదొక్కుతూనే ఉంటాడన్నారు. పేదల మనిషి జగనన్న మాత్రం చెప్పాడంటే చేస్తాడంతే అన్నారు. ఎన్నికల హామీలను నూరుశాతం అమలు చేసిన ఏకైక నాయకుడు మన జగనన్న మాత్రమేనని తెలిపారు.

గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. అబద్ధాలకు పేటెంట్ చంద్రబాబు పొందాడని.. ఎన్నికలు రాగానే ఆయన అబద్ధాలను వందల సంఖ్యలో రాసుకుని ప్రజలపై ప్రయోగించి మోసం చేసి గెలుస్తాడని అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జునయాదవ్ మాట్లాడుతూ.. చంద్రబాబు మోసాలను గ్రామ స్థాయిలో ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉందని గుర్తు చేశారు. నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. చంద్రబాబుని నమ్మితే నట్టేటా మునిగినట్టేనని మరోసారి రుజువైందని తెలిపారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు, రాష్ట్ర నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు మోదుగుల, బలసాని తదితరులు

చంద్రబాబు అంటేనే మోసం

వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: చంద్రబాబు అంటేనే మోసానికి కేరాఫ్ అడ్రస్ అని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ప్రత్తిపాడు గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో బలసాని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు అమలుకాని హామీలను ఇచ్చి ష్యూరిటీ బాండ్లను ప్రజలకు చూపిస్తూ చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలు గమనించాలని.. వాటిని గుర్తు చేస్తూ వైఎస్సార్ సీపీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలతో స్కాన్ చేయించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి వివిధ హోదాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు కళల్లోనూ రాణించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ పీఆర్కే ప్రసాద్

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పర్ఫామెన్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ నందలి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్ఫామెన్స్ థియేటర్‌లో బుధవారం విద్యార్థి కళాకారులకు ఆర్ట్ ఎప్రిసియేషన్, స్టడీ ఆఫ్ బ్యూటీ అన్న అంశంపై ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సంగీత నృత్య నాటక కళలకు సంబంధించిన విద్యార్థి కళాకారులందరూ భాగస్వామ్యం పొందారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పీఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ.. కళ, వాటి ఉపయోగం, విలువలు, వివిధ రకాలైనటువంటి లక్షణాల గురించి వివరించారు. రంగస్థలం మాట్లాడుతూ.. పాత్ర లోతులను అంచనా వేసుకుని పాత్రలతో మాట్లాడడం, పాత్రులు ఆశించిన విధంగా ఆ సౌందర్య వివరాలను ఆకలింపు చేసుకుని పాత్ర పోషించడంలో సౌందర్య కళ చాలా ముఖ్యమైందన్నారు. ఈ సమావేశానికి సంగీత కళల శాఖ అధిపతి డాక్టర్ మంజుల, మత్స్యశాఖ అధ్యాపకులు కాశయ్య, విశ్వనాథ్‌లు పాల్గొని విద్యార్థి కళాకారులకు ప్రోత్సాహన్ని అందించారు.

నిర్మానుష్య ప్రాంతంలో బైక్ చక్రాలు తొలగింపు



రైల్వేహాల్ట్ సమీపంలో ముళ్లపొదల్లో చక్రాలు లేని బైక్

పెదకాకాని: చాకచక్యంగా బైక్‌లు కాజేస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువురి బైక్‌లు మాయం అవుతున్నప్పటికీ కొన్ని మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. పెదకాకాని రైల్వేహాల్ట్ సమీపంలో ఉన్న నిర్మానుష ప్రాంతంలో కొత్త ద్విచక్ర వాహనం నిలిపి ఉంది. ఆ బైక్‌కు రెండు చక్రాలు, బ్యాటరీ, పలు స్పేర్‌స్పాట్‌లు తొలగించి ఉన్నాయి. ఈ బైక్‌ను అనకాపల్లి ప్రాంతం నుంచి దొంగిలించి పెదకాకాని ఏరియాకు తీసుకు వచ్చి ముళ్ల పొదల్లో వదిలేశారని.. బైక్‌లోని విలువైన సామాన్లను తొలగించి తీసుకు వెళ్లి ఉంటారని సమాచారం. అలానే నెల రోజుల క్రితం పెదకాకాని రైల్వేహాల్ట్ వద్ద పెట్టి వెళ్లిన బైక్ ఇప్పటికీ అలానే ఉంది. నాలుగు నెలల కిందట వెనిగండ్ల, అగతవరప్పాడు గ్రామాల మధ్య నిర్మానుష ప్రదేశంలో మరో బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు.